

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్, పాల్గొన్న నాయకులు

## 'రెడ్యా' గెలుపు కోసం సైనికుల్లా పనిచేద్దాం

కురవి: బీఆర్ఎస్ డోర్నకల్ అభ్యర్థి, ఎమ్మెల్యే రెడ్యానాయక్ గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని వీరభద్రస్వామి ఆలయ మాజీ చైర్మన్ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో మూడు బూత్‌లకు ఇన్‌చార్జులను నియమించారు. ప్రతిపక్షాల ఆరోపణలను సమగ్రంగా తిప్పకొట్టాలని సూచించారు. గ్రామంలోని 14 వార్డులకు ఆరుగురు చొప్పున బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సంగెం భరత్, గ్రామ అధ్యక్షుడు కొణతం విజయ్, ఎర్ర నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ తుకారాంనాయక్, మేక నాగిరెడ్డి, గ్రామ యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, దుడ్డెల వినోద్, వినయ్, సంతోష్, మల్సూర్, శ్రీనివాస్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు



ప్రచార రథానికి పూజలు చేస్తున్న కార్యకర్తలు

దంతాలపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ డోర్నకల్ అభ్యర్థి, ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ భారీ మెజార్టీతో గెలుపొందాలని కాంక్షిస్తూ పార్టీ కార్యకర్తలు పూజలు చేశారు. మండలంలోని పెద్ద ముప్పారం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పార్టీ యువత ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం రథాన్ని తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలో ఆదర్శంగా నిలిపిన రెడ్యానాయక్‌ను కారు గుర్తుపై ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో కొండ లింగమల్లు, ధర్మరాపు హరీశ్, ధర్మరాపు సందీప్, సోమన్న, యాకన్న, శోభన్, మణికుమార్, రమేశ్, కిరణ్, అన్వేశ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో పేదలకు మేలు

- రెడ్యానాయక్‌తోనే నియోజకవర్గ సమగ్రాభివృద్ధి
- అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి
- పార్టీ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి
- బీఆర్ఎస్ నాయకుల విస్తృత ప్రచారం



మరిపెడ: రూప్‌సింగ్ తండాలో కరపత్రాలతో ప్రచారం నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, కార్యకర్తలు

మరిపెడ, నవంబర్ 11: సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో నిరుపేదలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయని, డోర్నకల్ నియోకవర్గ సమగ్రాభివృద్ధి ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్‌తోనే సాధ్యమని పార్టీ రాష్ట్ర నాయకుడు కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తాళ్ల ఊకల్, రూప్‌సింగ్ తండాలో మ్యానిఫెస్టో పత్రులతో ప్రచారం నిర్వహించారు. తెల్లరేషన్ కార్డు ఉన్న కుటుంబానికి సన్నబియ్యం, రూ.400కే వంటగ్యాస్, ఆసరా పింఛన్లు రూ.5,016, దివ్యాంగులకు రూ.6,016లు, అర్హులైన మహిళలకు సౌభాగ్యలక్ష్మి ద్వారా రూ.3వేలు, రైతుబంధు సాయం రూ.16వేలు అందించనున్నట్లు వివరించారు. రాష్ట్రంలో 3,200 గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘతన సీఎం కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే రెడ్యానాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుగులోత్ వెంకన్న, సర్పంచ్ పాక రాజు, బొమ్మనపల్లి రమేశ్ పాల్గొన్నారు.

### గ్రామాల్లో జోరుగా ఎన్నికల ప్రచారం

చిన్నగూడూరు: మండల కేంద్రంతో పాటు జయ్యారం గ్రామంలో శనివారం బీఆర్ఎస్ నాయకులు రెడ్యానాయక్ గెలుపు కోరుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు వల్లూరి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన రెడ్యానాయక్ గెలుపు ఖాయమని, భారీ మెజార్టీ దిశగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కేసీఆర్‌ను మూడో సారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు నేడు దేశవ్యాప్తంగా ఆదరణ పొందుతున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### కేసీఆర్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

మరిపెడ: స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ సుభిక్షమైన పాలనలోనే గ్రామాలు ప్రగతి సాధించాయని తానంచర్ల సర్పంచ్ దిగజర్ల ముఖేశ్ అన్నారు. శనివారం గ్రామంలో ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి సభ్యులు రావుల వెంకటరెడ్డి, పాదూరి రాంచంద్రరెడ్డి పాల్గొన్నారు.



చిన్నగూడూరు: జయ్యారంలో మ్యానిఫెస్టోతో ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు



మరిపెడ: తానంచర్లలో ఇంటింటా ప్రచారం చేస్తున్న ముఖేశ్

# బంగారు తెలంగాణ సాధనే కేసీఆర్ లక్ష్యం



తోడేళ్లగూడెంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

డోర్నకల్, నవంబర్ 11: బంగారు తెలంగాణ సాధనే లక్ష్యంగా సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని తోడేళ్లగూడెం సర్పంచ్ పగడాల అంజయ్య అన్నారు. శనివారం జీపీలోని 4వ వార్డులో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల మ్యానిఫెస్టో వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రెడ్యానాయక్‌తోనే నియోజకవర్గంలోని గ్రామాల్లో సమగ్రాభివృద్ధి జరిగిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో సబ్బండ వర్గాలకు మేలు జరిగిందని, ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధిస్తుందన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి రెడ్యానాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ లాలూమియా, మన్నెగూడెం పీఏసీఎస్ వైస్ చైర్మన్ యలమద్ది మన్మధరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు పిట్టల శ్రీను, నాయకుడు సుంకరి వెంకన్న పాల్గొన్నారు.

**సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయం**

డోర్నకల్: రాష్ట్రంలో సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పాలన అందిస్తున్నారని, ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యా నాయక్‌తోనే నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని బొడ్రాయి తండా సర్పంచ్ తేజావత్ గమ్మిరాజు అన్నారు. శనివారం బీఆర్ఎస్ కార్యకర్తలు గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌తోనే తండాల్లో సమగ్రాభివృద్ధి జరిగిందన్నారు. సీఎం కేసీఆర్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి రాజ్యాధికారం కట్టబెట్టారని, కారు గుర్తుకు ఓటు వేసి రెడ్యానాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తేజావత్ భాస్కర్, ఎస్టీ సెల్ నాయకులు తేజావత్ రాజునాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బొడ్రాయి తండాలో మ్యానిఫెస్టోను వివరిస్తూ ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ గమ్మిరాజు

## ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

దంతాలపల్లి, నవంబర్ 11: అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా ప్రజలు సహకరించాలని ఎస్సై రమేశ్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని దాట్ల, బీరిశెట్టిగూడెం గ్రామాల్లో పారా మిలిటరీ దళాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై తారాసింగ్, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.



కవాతు చేస్తున్న పోలీస్, సీఆర్‌పీఎఫ్ బలగాలు

## మద్యం బాటిళ్ల సీజ్

దంతాలపల్లి, నవంబర్ 11: మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులపై శనివారం దాడులు నిర్వహించి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రమేశ్‌బాబు తెలిపారు. గ్రామంలో బెల్టు షాపులపై దాడులు నిర్వహించగా, శ్రీను ఇంట్లో నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను గుర్తించి సీజ్ చేశామన్నారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## రెండు తలల గొర్రెపిల్ల జననం

డోర్నకల్, నవంబర్ 11: సీరోలు మండలంలోని మన్నెగూడెం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి వీరభద్రం గొర్రెకు శుక్రవారం రాత్రి రెండు తలలతో గొర్రె పిల్ల జన్మించింది. దీనిని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తరలి వచ్చి ఆసక్తిగా తిలకిస్తున్నారు.

## అసంక్రమిత వ్యాధులను గుర్తించాలి

**జిల్లా వైద్యశాఖ అధికారి అంబరీష**



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో అంబరీష

కురవి, నవంబర్ 11: అసంక్రమిత వ్యాధులు బీపీ, షుగర్, హైపోటెన్షన్‌ను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి చికిత్స అందించాలని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ అంబరీష అన్నారు. శనివారం మండలంలోని కురవి, కాంపల్లి, ఉప్పరిగూడెం, బలపాల పీహెచ్‌సీ, మొగిలిచర్ల, రాజోలు హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మాట్లాడారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. గర్భిణుల వివరాలను 12 వారాల్లో నమోదు చేయాలని, వారందరికీ టీడీ వ్యాక్సిన్, వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలన్నారు. టార్గెట్ 100శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులు మలేరియా, చికున్ గున్యా, డెంగీ, పైలేరియా తదితర వ్యాధులను అరికట్టేందుకు ఫ్రైడే-డ్రైడే తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని సూచించారు. క్షయ వ్యాధిని గుర్తించడానికి తెమడ పరీక్ష చేయించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట కురవి పీహెచ్‌సీ డాక్టర్ విరాజిత, సిబ్బంది, డీపీఎం రుక్ముద్దీన్ ఉన్నారు.